ముురుగున పడిపోయింది

- గ్రామాల్లో కనిపించని డ్రెయినేజీ
- ముందుకు పారని మురుగు
- రోడ్లపైనే ప్రవాహం
- గ్రామస్తుల ఇబ్బందులు

గంపలగూడెం: గంపలగూడెం, తోటమూల గ్రామాలను డ్రెయినేజీ సమస్య వేధిస్తోంది. ఈ గ్రామాల్లో ప్రధాన రహదారితోపాటు అంతర్గత రహదారుల్లో సైతం డ్రెయినేజీలు లేకపోవడంతో ఎక్కడి మురుగు అక్కడే తిష్ట వేస్తోంది. మురుగునీరు పోయే మార్గం లేక రోడ్లపై ప్రవహిస్తోంది. దశాబ్దాలుగా ఈ సమస్య వేధిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. గంపలగూడెం షిర్డీ సాయిబాబా ధ్యాన నిలయం నుంచి తోటమూల గోసవీడు క్రాస్ రోడ్డు వరకు రెండు కిలో మీటర్ల పొడవున మెయిన్ రోడ్డు విస్తరించి ఉంది. రహదారి ఇరుకుగా ఉండటంతో కచ్చా డ్రెయిన్ సౌకర్యం కూడా లేదు. వర్షం కురిస్తే నీరు రోడ్డుపైనే పారుతోంది. రామ్మోహన్ థియేటర్ సెంటర్, పార్థసారథి సెంటర్, భజన మందిరం, విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వర్షం కురిసిన సమయంలో గంటల తరబడి నీరు రహదారిపైనే పారుతుండటంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ సమయంలో పాదచారుల పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది.

అంతర్గత రహదారులదీ ఇదే పరిస్థితి

గంపలగూడెం, తోటమూల గ్రామాల్లోని అంతర్గత రహదారుల్లో సైతం సరైన డ్రెయినేజీ సౌకర్యం లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గంపలగూడెంలో అంతర్గత రహదారులలో ప్రధానమైన 15 రోడ్లలో రెండు రోడ్లలో మాత్రమే పక్కా డ్రెయినేజీ నిర్మాణం జరిగింది. వీటితో పాటు మరో 40 చిన్న రోడ్లు, వీధులు ఉన్నాయి. ప్రధాన రహదారులలో రెండు చోట్ల సిమెంట్ రోడ్డు నిర్మించగా మిగిలిన రహదారులలో పరిస్థితి అస్తవ్యస్తంగా ఉంది. గ్రామంలోని కొన్ని రహదారుల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణం జరిగినప్పటికీ అక్కడ డ్రెయినేజీ నిర్మాణం చేపట్టలేదు. ఎస్సీ, బీసీ కాలనీల్లో సిమెంట్ రోడ్డు వేసిన చోట రహదారి కంటే ఇళ్లు పల్లంగా ఉండటంతో వర్షం నీరు ఇళ్లల్లోకి చేరుతోంది.



పక్కా డ్రెయినేజీ నిర్మించాల్సిన గంపలగూడెం మెయిన్ రోడ్డు



గంపలగూడెం రెడ్డి బజార్‌లో ఇలా..

డ్రెయినేజీ మెరుగుపడితేనే అభివృద్ధి



గంపలగూడెంలో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరిస్తేనే గ్రామాభివృద్ధి జరుగుతుంది. ప్రధాన రహదారి అయిన ఆర్‌అండ్‌బీ రోడ్డులో తప్పకుండా పక్కా డ్రెయినేజీ నిర్మించాల్సి ఉంది. అంతర్గత రహదారుల విషయంలో కూడా సిమెంట్‌రోడ్లు మంజూరు చేసే ముందు తప్పనిసరిగా పక్కా డ్రెయినేజీ నిర్మించాలి.

– కోట పుల్లమ్మ, సర్పంచ్, గంపలగూడెం

ఆక్రమణలు తొలగించాలి



పెద్దకొమిర పంచాయతీకి శివారు గ్రామమైన తోటమూల వై–జంక్షన్‌లో డ్రెయినేజీపై ఆక్రమణలు తొలగించాలి. ఇండ్లు, దుకాణాల ముందు మేరువుల కారణంగా డ్రెయినేజీలోకి నీరు పారే అవకాశం లేదు. దీనితో పాటు గంపలగూడెం హైస్కూల్ నుంచి తోటమూల గోసవీడు క్రాస్ రోడ్డు వరకు పక్కా డ్రెయినేజీ నిర్మించాలి. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

– దొంతాల బుచ్చి రామయ్య, ఎంపీటీసీ, పెద్దకొమిర

క్లుప్తంగా

రేషన్ డీలర్ల నియామకానికి రాత పరీక్ష



తిరువూరు: ఖాళీగా ఉన్న చౌకధరల దుకాణాల్లో డీలర్ల నియామకానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో రాత పరీక్ష నిర్వహించారు. తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో 22 రేషన్ దుకాణాల్లో డీలర్ల నియామకం జరిపేందుకు ఆర్డీఓ మాధురి జారీ చేసిన నోటిఫికేషన్‌కు స్పందించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరికీ ఈ రాతపరీక్ష జరిగింది. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు నిర్వహించిన ఈ పరీక్ష ప్రక్రియను ఆర్డీఓ పర్యవేక్షించారు.

జీసీటీఏ జిల్లా కార్యదర్శిగా రాముడు

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న డాక్టర్ జె. రాముడు ఎన్టీఆర్ జిల్లా ప్రభుత్వ కళాశాలల టీచర్స్ అసోసియేషన్ (జీసీటీఏ) జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ రవి తెలిపారు. విజయవాడ ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జరిగిన లెక్చరర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో జీసీటీయే జిల్లా కార్యదర్శిగా గెలుపొందారని చెప్పారు. రాముడు మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకుల సమస్యలపై పోరాడతానన్నారు. రాముడును స్టాఫ్ క్లబ్ తరఫున సన్మానించారు. క్లబ్ సెక్రటరీ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం. మహేష్ డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ కార్మికులతో కలిసి మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో పనిచేసే ఎలక్ట్రీషియన్, ప్లంబర్, ఫిట్టర్, వెల్డర్, కంప్యూటర్ ఆపరేటర్, ఆఫీస్ వర్క్ అటెండర్‌లను గత ప్రభుత్వం ఇంజినీరింగ్ కార్మికులుగా గుర్తించిందన్నారు. గత ఏడాది డిసెంబర్‌లో కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా జీఓ 36 ప్రకారం వారి వేతనాలు రూ.21 వేలకు పెంచిందని గుర్తుచేశారు. ఆ జీఓ మేరకు వారికి రూ.21 వేల వేతనాన్ని కూటమి ప్రభుత్వం చెల్లించాలని కోరారు. జీఓ 36 అమలు చేయని పక్షంలో వేతనాల పెంపు కోసం ఉద్యమ బాట పడతామని హెచ్చరించారు. ఇంజినీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

సదస్సు కరపత్రాల విడుదల



మైలవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు–కార్మికుల కర్తవ్యంపై ఈ నెల 19న మైలవరం సీఐటీయూ కార్యాలయంలో సదస్సు జరుగుతుందని సీఐటీయూ మైలవరం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మండలాల కార్యదర్శులు సీహెచ్ సుధాకర్, మహేష్, కె.బాలకృష్ణ తెలిపారు. సదస్సు జయప్రదాన్ని కోరుతూ మంగళవారం కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ కార్మికులు అధిక సంఖ్యలో సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ మైలవరం మండల అధ్యక్షులు శ్రీనివాసరావు, ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు బి. మారేశ్వరరావు, రైతు బజారు ముఠా నాయకులు పి. చంటి, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు ఎర్రంశెట్టి వీరమ్మ, చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం

మేడూరు(గంపలగూడెం): మేడూరు వీరాంజనేయస్వామి ఆలయంలో అఖండ హరే రామ నామ సప్తాహ మహోత్సవం రెండో రోజు మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు కోమండూరి ఆంజనేయ చార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. వీర హనుమాన్ రామయోగేంద్ర భక్త బృందంచే 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

దివ్యాంగ బాలలకు ఫిజియో థెరపీ

ముసునూరు: దివ్యాంగ బాలల తల్లిదండ్రులకు రమణక్కపేట మెయిన్ ప్రాథమిక పాఠశాల భవిత కేంద్రంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. దివ్యాంగ బాలలకు అందించాల్సిన సౌకర్యాలు, వసతులు, తీసుకోవలసిన జాగ్రత్తలను హెచ్ఎం లోకరాజు వివరించారు. అనంతరం డాక్టర్ ప్రశాంతి ఐదుగురు దివ్యాంగ బాలలకు ఫిజియోథెరపీ చేశారు.

పెన్షనర్లకు ఇబ్బంది లేకుండా సేవలు

డీటీఓ రవి



విస్సన్నపేట: సబ్ ట్రెజరీ కార్యాలయాలల్లో పెన్షనర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పెన్షన్ సక్రమంగా అందేలా చూస్తున్నామని, పెన్షనర్లను తమ బంధువులుగా భావించి సేవలు అందిస్తున్నామని జిల్లా ట్రెజరీ అధికారి ఎ. రవి అన్నారు. పెన్షనర్ల సమావేశం స్థానిక ట్రెజరీ ఆవరణలో మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెన్షనర్లు సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నల్లంటి సూరిరాజు పెన్షనర్ల సమస్యలను డీటీఓ దృష్టికి తీసుకువెళ్లారు. పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్ల సమయంలో కార్యాలయానికి వెళితే వేలిముద్ర పడలేదనో, వేరే కారణాలతో తిప్పి పంపకుండా ఫేషియల్, ఐరిష్ ద్వారా అయినా నమోదు చేయాలని, బెడ్ రెస్ట్ పెన్షనర్లకు ఇంటి వద్దే నమోదు చేయాలని కోరారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, విశ్రాంత ఉద్యోగులు డీటీఓను సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సబ్ ట్రెజరర్ ఎండీ అర్షాద్ ఉమర్, విశ్రాంత ఉపాధ్యాయులు ధనరాజు, పిరంగి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

అసిస్టెంట్ కలెక్టర్ శుభమ్ నోఖ్వాల్

చంద్రగూడెం(మైలవరం): రెవెన్యూ సదస్సులను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ శుభమ్ నోఖ్వాల్ అన్నారు. చంద్రగూడెం గ్రామంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ రైతులు వారి వ్యవసాయ భూముల సమస్యలను అర్జీల ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రజల వద్దకే పాలకులు వచ్చి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. సదస్సుకు రైతుల నుంచి 45 అర్జీలు అధికారులకు అందాయి. కార్యక్రమంలో మైలవరం తహసీల్దార్ జి. బాలకృష్ణారెడ్డి, అటవీ శాఖాధికారులు, దేవదాయ శాఖాధికారులు, రిజిస్ట్రేషన్ శాఖాధికారులు, చంద్రగూడెం సర్పంచ్ బి. శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.



చంద్రగూడెం సదస్సులో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ శుభమ్ నోఖ్వాల్

పుట్రేల సదస్సుకు 95 అర్జీలు

పుట్రేల(విస్సన్నపేట): మండలంలోని పుట్రేల గ్రామ సచివాలయం–1 వద్ద మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ కె. లక్ష్మీకల్యాణి మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల నిర్వహణను వివరించారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలపై 95 అర్జీలను అధికారులకు అందజేశారు. సదస్సులో మండల ప్రత్యేకాధికారి చక్రాణి, సర్పంచ్ కారుమంచి స్వాతి, రైతులు పాల్గొన్నారు.

కళాశాలలో వర్క్‌షాప్ ప్రారంభం

మైలవరం: అమెజాన్ వెబ్ సర్వీసెస్ సర్టిఫికేషన్‌కు ఎంతో ప్రాధాన్యత ఉందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మూడు వారాల వర్క్‌షాప్ అండ్ సర్టిఫికేషన్ ప్రోగ్రాం ఆన్ అమెజాన్ క్లౌడ్ ప్రాక్టీషనర్ అంశంపై సదస్సు ప్రారంభమైంది. స్మార్ట్ బ్రిడ్జ్ సహకారంతో ప్రారంభించిన ఈ కార్యక్రమం ఈ నెల 14 నుంచి 28 వరకు ఆన్‌లైన్‌లో కొనసాగుతుందన్నారు. ప్రిన్సిపాల్ అప్పారావు మాట్లాడుతూ ఏడబ్ల్యూఎస్ సర్టిఫికేషన్ ప్రాధాన్యతను వివరించారు. ప్రొఫెసర్, డీన్ డాక్టర్ వి. సూర్యనారాయణ, గెస్ట్ జాయ్ ప్రకాష్ నేథ మాట్లాడారు. డీన్ ఎకాడమిక్స్ డాక్టర్ ఎం. శ్రీనివాసరావు, డాక్టర్ డి. వీరయ్య, డాక్టర్ ఓ. రమాదేశి, డాక్టర్ ఎస్. జయప్రద తదితరులు పాల్గొన్నారు.

ధ్యాన దినోత్సవ ప్రకటన హర్షణీయం

ఇబ్రహీంపట్నం: ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని డిసెంబర్ 21వ తేదీన జరుపుకోవాలని ఐక్యరాజ్య సమితి ఇటీవల ప్రకటించడం హర్షణీయమని ప్రముఖ యోగా గురువు లంకే జనార్దన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారతదేశంతో పాటు పలు దేశాల ప్రతిపాదనలు ఈనెల 6న ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ ఆమోదించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందన్నారు. ఐక్యరాజ్య సమితిలోని భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీష్ ఎక్స్ వేదికగా ప్రకటించారన్నారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం యోగా, ధ్యానం అలవర్చుకోవాలని చెప్పారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ



చిలుకూరువారిగూడెం(మైలవరం): కృష్ణా మిల్క్ యూనియన్ మైలవరం క్లస్టర్ పరిధిలోని పాల ఉత్పత్తిదారులకు బోనస్ చెక్కులను మంగళవారం చైర్మన్ చలసాని ఆంజనేయులు అందజేశారు. చైర్మన్ మాట్లాడుతూ పశువులకు మినరల్ మిక్చర్, కాల్షియం, నులి పురుగుల ట్యాబ్లెట్స్ అందజేస్తున్నామని చెప్పారు. కృష్ణా మిల్క్ యూనియన్ ఏజీఎం ఎం. అన్వేష్, మైలవరం క్లస్టర్ మేనేజర్ టి. సాంబశివమూర్తి, పాల సంఘాల అధ్యక్షులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం

తిరువూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధికి సీనియర్ న్యాయవాది కంచర్ల ముత్యప్రసాద్ రూ.10 వేల విరాళాన్ని మంగళవారం అందజేశారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సైకిల్ స్టాండ్ నిర్మాణానికి పలువురు పూర్వ విద్యార్థులు విరాళం అందిస్తున్నారు. పాఠశాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రధానోపాధ్యాయుడు శంకరరావు కోరారు.

సాగుదారులకు పట్టాలివ్వాలని వినతి

మైలవరం: ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పేదలకు ఆ భూములపై హక్కు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పీవీ ఆంజనేయులు డిమాండ్ చేశారు. మైలవరం సీపీఎం కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆంజనేయులు మాట్లాడుతూ మైలవరం మండలం చంద్రగూడెం గ్రామంలోని సర్వే నంబర్ 11, 13, 14, 17 నంబర్లలోని భూమిని 23 కుటుంబాలు 1986 నుంచి సాగు చేసుకుంటున్నారని చెప్పారు. సాగుదారులను ఫారెస్ట్ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. సాగుదారులకు హక్కులు కల్పించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బాలకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కోట కల్యాణ్ మాట్లాడుతూ గతంలో తహసీల్దార్ కార్యాలయం సాగుదారులకు ఇచ్చిన పట్టాలను ఫారెస్ట్ శాఖాధికారులు ఆ పట్టాలు రద్దయ్యాయని చెబుతూ వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పేదల సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్, మండల కమిటీ సభ్యులు రావుల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ బాలకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హక్కుల ఉల్లంఘన నేరం

తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మోతీలాల్ నాయక్

తిరువూరు: సమాజంలో ప్రతి పౌరుడికీ హక్కులు ఉంటాయని, ఇతరుల హక్కులను హరించే అధికారం ఎవరికీ లేదని తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మోతీలాల్ నాయక్ అన్నారు. స్థానిక నాగార్జున జూనియర్ కళాశాలలో తిరువూరు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మోతిలాల్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. విద్యతో పాటు విజ్ఞానం కలిగిన వారికి మంచి ఉపాధి అవకాశాలుంటాయన్నారు. ర్యాగింగ్, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మద్యపానం, ధూమపానం వంటి చెడు అలవాట్లకు బానిస కాకూడదని చెప్పారు. బార్ అసోసియేషన్ చైర్మన్ వాకదాని లక్ష్మీనారాయణ, న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి మోతీలాల్ నాయక్

ఘనంగా ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం కొండపల్లిలో మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథి అఖిల భారత లాయర్ల యూనియన్ కార్యదర్శి సంపర దుర్గా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎందరో యోధుల పోరాట ఫలితంతోనే హక్కుల సాధనకు మార్గం ఏర్పడిందన్నారు. జేవీవీ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షుడు వి.మురళీమోహన్, పి.కామేశ్వరరావు, మాజీ సర్పంచి వి.అమ్మాజీ, న్యాయవాదులు యల్లమందయ్య, చింతా నాగరాజు, సర్దార్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దుర్గా శ్రీనివాసరావు

మానవ హక్కులు, బాధ్యతలకు ప్రాధాన్యం

నూజివీడు: భారత రాజ్యాంగంలో హక్కులకు, బాధ్యతలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెద ఖాసిం అన్నారు. పట్టణంలోని సారథి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ మానవ హక్కులకు భంగం వాటిల్లకుండా ప్రజలు తమ జీవనాన్ని కొనసాగించాలన్నారు. ఎవరికివారు స్వీయ నియంత్రణను కలిగి ఉంటే మానవ హక్కులకు ఎలాంటి భంగం వాటిల్లదని చెప్పారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్, న్యాయవాది గోపీనాథ్, ప్రిన్సిపాల్ ఎస్. శ్రీధర్, ఏఓ జి. రామచంద్రరావు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ముసునూరు: మండల పంచాయతీ కార్యదర్శుల యూనియన్ కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీనివాసచౌదరి, ఉపాధ్యక్షుడిగా ఆరేపల్లి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా నాగబాబు, కార్యదర్శిగా అబ్బూరి సుకుమార్, కోశాధికారిగా విద్యాధర్‌తో పాటు మరో ఎనిమిది మందిని వివిధ విభాగాల కార్యదర్శులు, సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం యూనియన్ ఆధ్వర్యంలో పనిభారం తగ్గించి, ఆదుకోవాలని కోరుతూ ఎంపీడీఓ జి. రాణికి వినతి పత్రం అందజేశారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్

చాట్రాయి: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. చనుబండ సీఎస్ఐ చర్చిలో రెవ పాస్టర్ పాల్ ఆధ్వర్యంలో దేవుని సువార్తను ప్రకటించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. క్రీస్తు గీతాలను ఆలపించారు. బెతెస్థ పెంతికోస్తు ప్రార్థనా మందిరంలో పాస్టర్ వైఎస్ పురుషోత్తమ చౌదరి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

జగనన్న కాలనీల్లో విజిలెన్స్ అధికారుల తనిఖీ

ముసునూరు: చింతలవల్లి, రమణక్కపేట, లోపూడి, గుళ్లపూడి గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో జిల్లా విజిలెన్స్ అధికారి శ్రీనివాస్ బృందం మంగళవారం తనిఖీలు నిర్వహించారు. జగనన్న కాలనీల్లో రహదారులు, మంచినీరు, విద్యుత్ సౌకర్యం తదితర వసతులను పరిశీలించారు. పూర్తయిన గృహాలను, అసంపూర్తిగా ఆగిన గృహాలను, పునాది దశలో ఉన్న ఇళ్లను పరిశీలించి స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్ కుమార్, ఆర్ఐ దీపిక తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వృద్ధుడి మృతి

ముసునూరు: ముసునూరులోని ఓ చెరువు వద్ద మతిస్థిమితం లేని వృద్ధుడు మృతిచెందాడు. ఆయన వలసపల్లి గ్రామం వైపు నుంచి మూడు రోజుల కిందట ముసునూరు వచ్చాడు. నీరసంగా ఉండడం చూసిన స్థానికులు మంచినీళ్లు, ఆహారం ఏర్పాటు చేస్తామన్నా నిరాకరిస్తూ ముసునూరు పరిసరాల్లో సంచరించాడు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక దేవర చెరువు వద్ద వృద్ధుడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు.

జానపద నృత్య పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

చాట్రాయి: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన జానపద నృత్య పోటీల్లో చిన్నంపేట సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి సీనియర్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచారు. జూనియర్ విభాగంలో కన్సొలేషన్ బహుమతి సాధించారు. సత్తుపల్లి స్టెప్ అప్ డ్యాన్స్ అకాడమీ 14వ వార్షికోత్సవం సందర్భంగా ఈ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థులను ప్రిన్సిపాల్ పలగాని శ్రీనివాసరావు అభినందించారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి

జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా

నూజివీడు: రైతుల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు, రైతులకు పంటల సాగులో సలహాలు, సూచనలు ఇచ్చేందుకు పొలం పిలుస్తోంది కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ఏలూరు జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా అన్నారు. నూజివీడు, పల్లెర్లమూడిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విత్తన మొక్కజొన్నను సాగు చేసే రైతులు కచ్చితంగా విత్తన మొక్కజొన్న కంపెనీల నుంచి ఒప్పందాలను లిఖితపూర్వకంగా చేసుకోవాలన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమాలో రైతులు మొక్కజొన్నకు ఎకరాకు రూ.483 ప్రీమియం చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ జి. విద్యాసాగర్, ఏఓ చాముండేశ్వరి, వీహెచ్ఏ హర్షియా, రైతులు పాల్గొన్నారు.

మేల్ హెల్త్ అసిస్టెంట్లను కొనసాగించాలి

చాట్రాయి: వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న మేల్ హెల్త్ అసిస్టెంట్లను కొనసాగించాలని యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీవీ రమణ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో 1,500 మంది మేల్ అసిస్టెంట్లను అప్పటి ప్రభుత్వం నియమించిందని, వీరంతా 20 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఏనాటికైనా ఉద్యోగం క్రమబద్ధీకరణ అవుతుందనే ఆశతో వారంతా విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఇటీవల తెలంగాణ హైకోర్టు ఆదేశాలను అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం మేల్ హెల్త్ అసిస్టెంట్లను తొలగించాలని ఆదేశాలిచ్చిందని చెప్పారు. కోవిడ్ సమయంలో విశేష సేవలందించిన మేల్ హెల్త్ అసిస్టెంట్లను మానవతా దృక్పథంలో కొనసాగించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

నూజివీడు: నూజివీడులో రవాణా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇన్‌చార్జి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బాలెందు శేఖర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించి, వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలను నడపరాదన్నారు. రికార్డులు సక్రమంగా లేని వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ప్రత్యేక డ్రైవ్‌లో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు కృష్ణవేణి, అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పైప్‌లైన్ వివాదంలో సర్పంచ్ దౌర్జన్యం

ఆగిరిపల్లి: కొత్త ఈదర సర్పంచ్ బెక్కం రాజగోపాల్ అదే గ్రామానికి చెందిన పోలిశెట్టి సత్యనారాయణపై దౌర్జన్యం చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్త ఈదర దాసాంజనేయ స్వామి ఆలయ స్థలంలో ఉద్దేశపూర్వకంగా సర్పంచ్ బెక్కం రాజగోపాల్ వాటర్ పైప్‌లైన్ వేయడానికి ఏర్పాట్లు చేశారు. ఆలయ ట్రస్టు బోర్డు సభ్యుడు, మాజీ సర్పంచ్ పోలిశెట్టి సత్యనారాయణ దీనికి అభ్యంతరం తెలిపారు. వాటర్ పైప్‌లైన్ ఆలయ స్థలంలో కాకుండా పక్కన వేసుకోవాలని సూచించాడు. ఆగ్రహించిన రాజగోపాల్ వ్యక్తిగత దూషణ చేస్తూ దౌర్జన్యానికి దిగాడు. బాధితుడు పోలీసులను ఆశ్రయించి సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేశారు.

లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

తిరువూరు: ప్రభుత్వ పెన్షన్ పొందే రిటైర్డు ఉద్యోగులందరూ లైఫ్ సర్టిఫికెట్లు సకాలంలో అందజేయాలని ఎన్టీఆర్ జిల్లా ఖజానా, గణాంకాధికారి ఎ. రవి అన్నారు. స్థానిక బాపూజీ పెన్షనర్స్ హోంలో మంగళవారం పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్ల ఆవశ్యకతపై అవగాహన కల్పించేందుకు సమావేశం నిర్వహించారు. రిటైర్డు ఉద్యోగులు తమ పెన్షను కొనసాగింపునకు లైఫ్ సర్టిఫికెట్ అవసరమవుతుందన్నారు. పెన్షనర్ల సంఘం తిరువూరు యూనిట్ అధ్యక్షుడు బల్లిపర ప్రసాద్, ఉప ఖజానాధికారి అర్షద్ ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

మైలవరం: జి.కొండూరు మండలం కోడూరు గ్రామంలో ముక్కమల్ల వెంకటరావు మద్యం అమ్ముతుండగా అరెస్ట్ చేశారు. అతని నుంచి ఐదు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

దుష్ఫలితాలపై అవగాహన..

సారా అమ్మడం, తరలించడం చట్టరీత్యా నేరమని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ జోశ్యుల శ్రీనివాస్ అన్నారు. రెడ్డిగూడెం మండలం కూనపరాజుపర్వ గ్రామంలో అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లో సారా మహమ్మారిని తరిమికొట్టాలన్నారు. సారా తయారీ, విక్రయదారుల సమాచారం అందించాలని కోరారు. కూనపురాజుపర్వ గ్రామం ఉత్తర, దక్షిణ దళితవాడల్లో సారా తయారీ, విక్రయాలపై ఆరా తీశారు. సారా దుష్ఫలితాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామ పెద్దలు రాయుడు, పంచాయతీ వార్డు సభ్యుడు సతీష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్ట్

తిరువూరు: తిరువూరు మండలం కాకర్లలో బాణావత్ వినోద్‌కుమార్ సారా విక్రయిస్తూ ఎక్సైజ్ సిబ్బందికి పట్టుబడ్డాడు. విస్సన్నపేట మండలం వేమిరెడ్డిపల్లికి చెందిన వినోద్ కుమార్ ద్విచక్ర వాహనంపై 35 లీటర్ల సారా తరలిస్తూ కాకర్లలో పట్టుబడ్డాడు. నిందితుడిని ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేసి తిరువూరు కోర్టులో హాజరుపరచారు. నిందితుడికి 15 రోజులు రిమాండ్ విధిస్తూ మేజిస్ట్రేట్ ఆదేశాలిచ్చారు. విస్సన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు జరిపిన దాడుల్లో నరసాపురంలో ముగ్గురు పాత నేరస్తులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. గతంలో బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించి నేరాలకు పాల్పడుతున్న అంగోతు చాందినీని కూడా విస్సన్నపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద బైండోవర్ చేశారు.